మురుగుతున్న నిర్లక్ష్యం..!

- రోడ్డుపై పారుతున్న మురుగునీరు
- దుర్వాసనలోనే ప్రయాణాలు
- ఇబ్బంది పడుతున్న వర్తకులు

పెద్దాపురం: పది గ్రామాల జంక్షన్. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి. రెండు నియోజకవర్గాల ప్రధాన రహదారిపై యథేచ్ఛగా మురుగు విలయ తాండవం చేస్తోంది. వర్షం నీరు రోడ్డుపై పారితే ఇబ్బందులు ఉండవు కానీ, నిత్యం మురుగులోనే వ్యాపారాలు నడుపుకోవాలంటూ వర్తకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదేక్కడో మారుమూల ప్రాంతం కాదు. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి జంక్షన్‌లో నిత్యం మురుగునీరు పారుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో వాహనాలు, పాదచారులు ఆ మురుగులోనే ప్రయాణం సాగిస్తున్నారు. రహదారిపై అక్రమ కట్టడాలు, డ్రైన్ నిర్మాణం లేకపోవడంతో వరుస భవనాల నుంచి విడుదలయ్యే మురుగు నీరు ప్రధాన రహదారిపైకి చేరుతుంది. ఆసుపత్రి, మెకానిక్ షెడ్లు, సిమెంట్ దుకాణాల మీదుగా రోడ్డుపై మురుగు నీరు చేరడంతో వర్తకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేసినా

గ్రామంలో ప్రధాన రహదారిపై నిత్యం మురుగు నీరు విలయ తాండవం చేస్తోందని పంచాయతీ అధికారులకు వర్తకులు ఫిర్యాదు చేశారు. దీంతో హాస్టల్ భవనం, మరికొన్ని భవనాల నుంచి వస్తున్న మురుగునీరు పారితే సహించేది లేదంటూ నోటీసులు జారీ చేశారు. ఏదో రెండు రోజులు మురుగునీరు రాకుండా చర్యలు తీసుకున్నారు. మళ్లీ షరా మామూలే అన్న చందంగా మురుగునీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది.



చంద్రమాంపల్లి ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు



చంద్రమాంపల్లి హాస్టల్ నుంచి వస్తున్న వ్యర్థాలు



పిల్లల ఆసుపత్రి వద్ద చెత్తాచెదారం

సమస్యను పరిష్కరించాలి



పంచాయతీలో ఉన్న అక్రమ కట్టడాలు, మురుగునీరు విలయతాండవంపై ఉన్నతాధికారులు స్పందించాలి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై వర్షపు మడుగులా గోతిల్లో నీరు చేరడం, దారి పక్కన నీరు ఉండడంతో వాహనదారులు, వర్తకులు ఇబ్బందులు పడుతున్నారు. మా సమస్యపై త్వరిగతిన అధికారులు స్పందించి పరిష్కరించాలి.

– మేకా లోవరాజు, బైక్ మెకానిక్, చంద్రమాంపల్లి

అక్రమ కట్టడాలు, పూర్తికాని డ్రైన్‌లు

చంద్రమాంపల్లి పంచాయతీ పరిధిలో రోడ్డుపై చాల వరకు భవనాలు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. పంచాయతీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో అడ్డగోలుగా భవన నిర్మాణాలు చేపట్టడంతో ఇప్పుడు ఆ భవనాల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, మురుగునీరు పోయే మార్గం లేక రోడ్డుపైకి సుమారు 300 మీటర్లు మేర మురుగు నీరు వచ్చి చేరుతుంది. దీంతో దుర్వాసన, మురికి కంపులోనే రాకపోకలు సాగిస్తుండగా.. వ్యాపార దుకాణాల వద్ద మురుగునీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

క్లుప్తంగా

శ్రీపాద వల్లభునికి లక్ష తులసి పూజ



ప్రత్యేక అలంకరణలో శ్రీపాద వల్లభ స్వామి

పిఠాపురం: పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో వల్లభ స్వామి వారి సప్తాహ మహోత్సవాలు మూడు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి లక్ష తులసి పూజ నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులు భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. స్వామి వారి సప్తాహ మహోత్సవాల సందర్భంగా ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ సౌజన్య తెలిపారు.

3న మండల సర్వసభ్య సమావేశం

సామర్లకోట: ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 3న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హిమ మహేశ్వరీ తెలిపారు. 3వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆయా డిపార్టుమెంట్‌ల జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు సమావేశానికి హాజరుకావాలన్నారు.

వైద్యాధికారికి సత్కారం



సుష్మను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు పొందిన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు శాలువతో సత్కరించారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రావు చిన్నారావు, సర్పంచులు కర్రి చిన్నారావు, పాలని దొరబాబు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ చేనేత విభాగ అధ్యక్షుడు గోపి హిరిబాబు, సత్యనారాయణ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో సిబ్బందికి శిక్షణ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం ఆదర్శ ఇంజినీరింగ్ కాలేజీలో టీచర్స్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ సంబంధించిన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నుంచి వెరిఫికేషన్ ఉన్న నేపథ్యంలో 1,241 మంది అభ్యర్థులకు 25 వెరిఫికేషన్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి టీంలోనూ ఒక ఎంఈఓ, జీహెచ్‌ఎం, రెవెన్యూ డీటీ, ఎంఐఎస్ డేటా ఆపరేటర్ ఉంటారని అధికారులు తెలిపారు. ప్రతి టీం 50 మంది అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. అభ్యర్థులు వెరిఫికేషన్‌కు వచ్చినప్పుడు 3 సెట్స్ అటెస్టెడ్ సర్టిఫికెట్‌ల కాపీలు, 5 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. శిక్షణా కార్యక్రమానికి ఆర్‌జేడీ నాగమణి, డీఈఓ పిల్లి రమేష్, మూడు జిల్లాల అసిస్టెంట్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు



పూజలందుకుంటున్న శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుడి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూలమాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.2.15 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. 12 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారన్నారు.

ఆలయంలో చోరీ

కొత్తపల్లి: మండలంలోని కొత్త ఇసుకపల్లిలో ఉన్న సత్తెమ్మతల్లి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో ఉన్న హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి సొమ్మును దొంగిలించారు. హుండీలో సుమారు రూ.10 వేలు ఉండొచ్చని తెలిపారు. దీనిపై పోలీసు వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ తప్పనిసరి

సామర్లకోట: అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ తప్పనిసరి అని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ ప్రసాదరావు అన్నారు. వారం రోజులపాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలోని జిల్లా పరిషత్, మండల పరిషత్ కార్యాలయాల్లో పని చేసే జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు శిక్షణ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రోస్టర్ పద్ధతిలో ఉద్యోగుల పోస్టులు మార్చి పని చేయాల్సి ఉంటుందని, దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి త్వరలో జీఓ వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జిల్లా పరిషత్, మండల పరిషత్‌లలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, పంచాయతీల కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు జూనియర్ అసిస్టెంట్లుగా పని చేయాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్లు ఈఓపీఆర్డీలు, ఈఓపీఆర్డీలు సీనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ విధులపై అన్ని శాఖలకు సంబంధించి అవగాహన ఉండాలన్నారు. శిక్షణ ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణ, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ అలపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మద్యంపై అవగాహన సదస్సు

సామర్లకోట: మద్యానికి బానిస కావడం ద్వారా ఆరోగ్యం పాడైపోయే ప్రమాదం ఉందని ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి హెచ్చరించారు. హుస్సేన్‌పురంలోని వెంకట్రామ ఆయిల్స్ ఫ్యాక్టరీ ఆవరణలో నవోదయం కార్యక్రమంలో భాగంగా మద్యానికి వ్యతిరేకంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. మద్యం అలవాటు చేసుకోవడం వలన కలిగే దుష్పరిణామాలను ఆమె వివరించారు. సరదా కోసం మద్యం సేవించడం అలవాటు చేసుకొని అనేక మంది ఆస్తులను పోగొట్టుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రామ్మోహనరావు, ఎస్సై బీఎస్ఎస్ వరహాలు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కృష్ణకుమారి

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: మహిళలు అన్ని రంగాల్లో రాణించవచ్చని చైతన్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ కలిదిండి బదరీలక్ష్మి అన్నారు. స్థానిక గాంధీనగర్ క్షత్రియ పరిషత్ కమ్యూనిటీ హాల్లో శనివారం క్షత్రియ పరిషత్ మహిళా విభాగం ఆరో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే.. ఆ కుటుంబం.. తద్వారా సమాజం ఎంతో ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళలు ఇంటి పనులే కాకుండా వివిధ రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వీఎస్ లక్ష్మీ కళాశాల మేనేజింగ్ డైరక్టర్ సంధ్య మాట్లాడుతూ, క్షత్రియ మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారని, ఆయా రంగాలకు చెందిన వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. క్షత్రియ మహిళా విభాగం అధ్యక్షురాలు పెన్మత్స పార్వతి మాట్లాడుతూ, నిరుపేదలైన క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతి ఏటా క్రమం తప్పకుండా స్కాలర్‌షిప్‌లు, అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. విభాగం కార్యదర్శి ఇందుకూరి దేవీవర్మ మాట్లాడుతూ, మహిళా విభాగాన్ని మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. నూతన సభ్యులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్షత్రియ మహిళల వ్యాపార ఉత్పత్తులను ప్రదర్శించారు. వినాయక చవితి సందర్భంగా సభ్యులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు దాట్ల పార్వతి, వాత్సవాయి లక్ష్మీదేవి, శేషుకుమారి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ఎండీ సంధ్య

యానిమేటర్ నియామకంపై డ్వాక్రా మహిళల ఆందోళన



అవంతినగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామం అవంతినగర్‌లో డ్వాక్రా మహిళలు శనివారం ఆందోళన చేపట్టారు. తిమ్మాపురం-4 వీఓఏ పోస్టు ఖాళీ కావడంతో భర్తీ చేసేందుకు సూర్యతేజ డ్వాక్రా సంఘ సభ్యురాలు సైనబరపు దేవిని యానిమేటర్(వీఓఏ)గా నియమించాలని డ్వాక్రా సంఘాల మహిళలు సమావేశమై తీర్మానించారు. ఈ తీర్మానం వివరాలు స్త్రీశక్తి భవనంలో వెలుగు ఏపీఎం, సీసీలకు అందజేశారు. ఆమెను ఆమోదించినట్టు తెలిపి, తర్వాత మరో మహిళ పేరును గ్రామ రాజకీయ నాయకులతో కుమ్మక్కై అధికారులు వెలుగులోకి తీసుకురావడంపై మహిళలు ఆందోళన చేపట్టారు. గ్రామ సంఘం తీర్మానాన్ని విస్మరించి, ఇష్టం వచ్చినట్టు యానిమేటర్‌ను నియమిస్తే ఊరుకోబోమని డ్వాక్రా మహిళలు సూరంపూడి దుర్గ, కుమారి, లక్ష్మి, తదితరులు మీడియాకు చెప్పారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఏపీఎం, సీసీలపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

గణేశ్ పంచరత్న పోటీల వేదిక మార్పు

బోట్‌క్లబ్: వినాయక చవితి సందర్భంగా భరద్వాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గణేశ్ పంచరత్న స్తోత్రంపై 5 నుంచి 15 ఏళ్ల పిల్లలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షులు డాక్టర్ ఐవీ రావు, కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. పోటీలకు వచ్చే వారు అధికంగా ఉన్న దృష్ట్యా పోటీల వేదికను మార్పు చేసినట్లు చెప్పారు. ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని జిల్లా క్రీడా మైదానం సమీపంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)భవన ప్రాంగణంలో పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అధిక సంఖ్యలో చిన్నారులు వస్తున్నారన్నారు. భారతీయ ఇతిహాస పురాణాల ప్రభావాన్ని పరిచయం చేయాలన్నదే లక్ష్యమన్నారు. గణేశ పంచరత్న స్తోత్రాలను శ్రావ్యంగా ఆలపించిన వారికి బహుమతులతో పాటు, కన్సొలేషన్ బహుమతులు ఇస్తామన్నారు.

ఏర్పాట్లు షురూ..!

- ముస్తాబవుతున్న గణపయ్య విగ్రహాలు
- చవితి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు
- 27 నుంచి నవరాత్రులు ప్రారంభం

కొత్తపల్లి: వినాయక చవితి సంబరాలకు గణనాథులు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాలతో పాటు పిఠాపురం టౌన్, గొల్లప్రోలు నగర పంచాయతీలో సుమారుగా 1000 వరకూ విగ్రహాలను ఏర్పాట్లు చేసేందుకు ఉత్సవ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలకు రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. మండపాలను వివిధ రకాల ఆకతులతో ఏర్పాట్లు చేస్తున్నారు. పిఠాపురం, సామర్లకోట, కాకినాడ, రాజమండ్రి పట్టణాలకువె వెళ్లి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. రూ.3 వేలు నుంచి 25 వేలు విలువ చేసే విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు కొనుగోలు చేస్తున్నారు. భారీ స్థాయిలో ఉత్సవాలు నిర్వహించేందుకు కమిటీలు ఉత్సాహాన్ని చూపుతున్నాయి. ప్రతిరోజూ ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జన సమయంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.



వాకతిప్పలో గణపతి ఉత్సవాలకు మందిరాన్ని సిద్ధం చేస్తున్న యువత

అనుమతులు తప్పనిసరి



27 నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి మహోత్సవాలకు అనుమతులు తప్పనిసరి. ఏర్పాటు చేసే మందిరాలకు కమిటీ సభ్యులు ముందస్తుగా సింగిల్ విండోస్ సిస్టం (ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేసుకోవాలి) తీసుకోవాలి. మైక్‌లకు అనుమతి ఉండాలి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాలు, నిమజ్జన విషయాలను కమిటీ సభ్యులు ముందుగా తెలపాలి. ఉత్సవాల్లో అసాంఘీక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

– వెంకటేష్, ఎస్సై, కొత్తపల్లి.

నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి

కరప: అంటువ్యాధులకు కారకమైన దోమలు పెరగకుండా గ్రామాల్లోని డ్రైన్లలో, వీధుల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో డ్రైన్లలో నీరు నిల్వలేకుండా పూడికలు తొలగించాలన్నారు. దోమలు పెరిగే మురికినీటి కుంటలను పూడ్చాలన్నారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించాలన్నారు. మాన్‌సూన్ హైజీన్ (వర్షాకాల పరిశుభ్రత) కార్యక్రమాన్ని మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ, సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, యానిమేటర్లు, గ్రామస్తులు స్వచ్ఛ ర్యాలీలు నిర్వహించారు.



కరపలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు

రక్తదానం ప్రాణదానంతో సమానం

బాలాజీచెరువు: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆదిత్య డిగ్రీ కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అన్నారు. కళాశాలలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ, మొదటిసారి రక్తదానానికి 23 మంది స్వచ్ఛందంగా రావడం సంతోషదాయకమన్నారు. ఆరోగ్యవంతులు ఏడాదికి మూడుసార్లు రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం శిబిరంలో సేకరించిన 65 యూనిట్ల రక్తాన్ని జీజీహెచ్ బ్లడ్‌బ్యాంక్ వైద్యులు అనిల్‌కు అందజేశారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రజా సమస్యలపై ఉధృత పోరాటాలు

కాకినాడ సిటీ: ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఎం కాకినాడ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శనివారం సీపీఎం కాకినాడ జిల్లా పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులను స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గవర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ, కేంద్రంలో మోదీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చి, మతోన్మాదం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని విచ్ఛిన్నం చేస్తూ, ప్రైవేటీకీకరణను వేగవంతం చేస్తూ, జాతి సంపదను కొన్ని బడా కంపెనీలకు ధారాదత్తం చేస్తోందన్నారు. అంబానీ, అదాని తదితర కార్పొరేట్ శక్తులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ, ప్రజలపై భారాలను మోపుతున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ముక్కలు చేస్తూ అమ్మేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమాలు చేయాలని, ప్రతి పార్టీ సభ్యుడు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 28న ప్రతిజ్ఞా దినంగా జరపాలన్నారు. విద్యుత్ వినియోగం పెరగకపోయినా బిల్లులు ఎందుకు ఎక్కువగా వస్తున్నాయో ప్రజలకు వివరించాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వం వెంటనే రైతులకు ఎరువుల సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంటల బీమా సరిగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, జి.బేబీరాణి, కేఎస్ శ్రీనివాస్, ఎం రాజశేఖర్, పలివెల వీరబాబు, సీహెచ్ రాజ్‌కుమార్, సీహెచ్ రమణి, నీలపాల సూరిబాబు, టి.ఈశ్వరరావు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు. తొలుత కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం నాయకుడు వి.అచ్యుతానందన్, సీపీఐ మాజీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి దీపక్‌బాకువా మృతికి సంతాపం ప్రకటించింది.

సీఎం పర్యటనతో మూతపడిన షాపులు



నిర్మానుష్యంగా ఉన్న సామర్లకోట- పెద్దాపురం రోడ్డు

సామర్లకోట: పెద్దాపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా శనివారం పెద్దాపురం రోడ్డులో అనేక షాపులను ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు మూసి వేయించారు. దీనికి తోడు పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల పరిధిలోని అన్ని మద్యం షాపులను మూసి వేయాలని ఆదేశించారు. దాంతో పెద్దాపురం రోడ్డులోని మద్యం షాపులు, రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.

విద్యార్థుల స్వచ్ఛత ర్యాలీ

సామర్లకోట: పరిశుభ్రతను పాటించడం ద్వారా అంటు వ్యాధులను దూరం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ మేరకు పాఠశాల నుంచి పట్టణ పురవీధుల గుండా విద్యార్థులతో కలిసి స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. బయట నుంచి ఇంటికి వెళ్లిన వెంటనే చేతులను కాళ్లను శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదుర్గ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రాజెక్టు



ప్రాజెక్టును తిలకించిన సీఎం చంద్రబాబు

సామర్లకోట: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల బాలికలు తయారు చేసిన ప్రాజెక్టు ఆకట్టుకుంది. సీఎం చంద్రబాబు పెద్దాపురం ప్రజావేదికలో పాల్గొన్న సందర్భంగా స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర ఎగ్జిబిషన్‌ను తిలకించారు. బాలికలు పట్నాల లక్ష్మి శరణ్య, సహస్ర త్రిబిన్ ప్రాజెక్టును ప్రయోజాత్మకంగా ప్రదర్శించారు. దాంతో సీఎంతో పాటు కలెక్టర్ బాలికలను అభినందించారు. ఈ ప్రాజెక్టు మూడు రకాలుగా పని చేస్తుందని వివరించారు. తడి, పొడి చెత్త, హనికరమైన చెత్తలను గుర్తించడంలో పని చేస్తుందని వివరించారు. ఎమ్మెల్యే చినరాజప్ప, హెచ్‌ఎం విజయలక్ష్మి, విద్యా కమిటీ వైస్ చైర్మన్ పచ్చాకుల లోవరాజు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ ఉద్యానవనంలో శనివారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. బోట్‌క్లబ్ ఉద్యానవనం వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మట్టి ప్రతిమల వినియోగంపై అవగాహనతో పాటు, రసాయనాలతో కూడిన విగ్రహాల వల్ల కలిగే అనర్థాలపై పలువురు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానంపై వర్క్‌షాప్



కార్యక్రమంలో మాట్లాడుతున్న గుంత లక్ష్మణ్

బాలాజీచెరువు: ఐక్యూఏసీ ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020పై శనివారం వర్క్‌షాప్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు అధ్యక్షత వహించారు. అఖిల భారతీయ శైక్షిక మహా సంఘ్ జాతీయ నిర్వహణ కార్యదర్శి గుంత లక్ష్మణ్ పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానంలో వచ్చిన మార్పులను వివరించారు. విద్యారంగంలో వచ్చిన మార్పులు, పరిశ్రమలకు అనుబంధంగా సిలబస్ రూపకల్పన వంటి వాటిపై చర్చించారు. వివిధ ప్రాంతాల కళాశాలలకు చెందిన 185 మంది అధ్యాపకులు జాతీయ విద్యా విధానంపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉమేష్ చతుర్వేది, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉదయభాస్కర్, ఏయూ ప్రొఫెసర్ మదన్‌మోహన్, జేఎన్‌టీయూకే రిటైర్డ్ ప్రొఫెసర్ అబ్బయ్య, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పసుపులేటి హరిరామప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా చీడీలపార డ్రైన్

కాకినాడ లీగల్: చీడీలపార డ్రైనేజీ ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ రక్షణ గోడ పలు ప్రాంతాల్లో కూలిపోయింది. డ్రైనేజీని అనుకున్న రహదారిపైనే పాదచారులు, వాహనదారులు, చిన్నారులు సైకిళ్లపై ప్రయాణిస్తున్నారు. అశోక్‌నగర్ నుంచి ఇంద్రపాలెం ఉప్పుటేరులో కలిసే ఈ చీడీలపార డ్రైన్‌కి పలుచోట్ల రక్షణ గోడ లేకపోవడం, కొన్నిచోట్ల రక్షణ గోడ కూలిపోవడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్రైన్‌కు రక్షణ గోడ నిర్మించాలని వారు కోరుతున్నారు.